క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: ఇందు అపార్టుమెంట్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమ లింగప్ప సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇందు అపార్టుమెంట్ విల్లాస్, ఆర్టీఓ కార్యాలయం, ఎల్ఐజీ 4 ఫేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



విజేతలతో మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు

కూకట్‌పల్లి: యువత పెడదోవ పట్టకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని స్వచ్ఛ భారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు అన్నారు. భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛభారత్ అభియాన్ ఆధ్వర్యంలో సోమవారం కేపీహెచ్‌బీ రమ్యాగ్రౌండ్‌లో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించి విజేతలకు షీల్డులు, ప్రైజ్ మనీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం యువతను క్రీడల వైపు మళ్లించడానికి గ్రౌండ్లు తగినంతగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, స్వచ్ఛ భారత్ అభియాన్ సభ్యులు కర్ర గోపి, శ్రీకరరావు, వినోద్, పవన్, గురు ప్రసాద్, ప్రేమ్ కుమార్, వీరాచారి, సత్యనారాయణ, సూరిబాబు, గణేష్, శేఖర్, రవి, రేవతి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌పీ రోడ్డు గాయత్రిమందిర్, హెచ్‌పీ రోడ్డు మెయిన్ రోడ్డులో రూ.40 లక్షల నిధులతో వేసిన సీసీ రోడ్డును కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ సోమవారం పరిశీలించారు. హెచ్‌పీ రోడ్డులో 90 శాతం డ్రైనేజీ, సీసీ రోడ్డు, వాటర్ లైన్‌ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. హెచ్‌పీ రోడ్డు గాయత్రిమందిరం రోడ్డులో అత్యధికంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేదని, నూతన డ్రైనేజీ లైన్ వేసిన అనంతరం రోడ్డు వేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీఈ ప్రవంతి, ఏఈ రాధాకృష్ణ, సంక్షేమ సంఘం అధ్యక్షులు జగదీష్, సుదర్శన్ రెడ్డి, తూము నారాయణ, మల్లికార్జున్, శ్రీనివాస్, ఎలిజబెత్, బాబురావు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

సాక్షి,సిటీబ్యూరో: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం తూముకుంటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేయనున్నట్లు కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూరి వజ్రేష్ యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఏఐసీసీ పిలుపు మేరకు తూముకుంట నుంచి కలెక్టరేట్ వరకు నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



స్నేహ మోడల్ స్కూల్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు



పర్వత్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం, పాస్టర్ డానియల్ తదితరులు

ఆల్విన్‌కాలనీ:

కూకట్‌పల్లి సర్కిల్ శంషీగూడ ఇంద్రాహిల్స్ స్నేహ మోడల్ స్కూల్‌లో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఎర్రవల్లి సతీష్‌రావు, కరస్పాండెంట్ ఎం. రాజు, ప్రిన్సిపాల్ ఎం. మమతరాజ్, పాస్టర్ హరిస్, పాస్టర్ ఇశ్రాయిల్, ఎం.స్నేహ రాజ్, ఎం. నిఖితా రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో..

మూసాపేట: కూకట్‌పల్లిలోని ఆర్టీసీ డిపోలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ డి. హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఎంఎఫ్ రాజేశ్వరి, సావిత్రి, సుందర్, ఉద్యోగులు పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డిపో మేనేజర్ హరి

పర్వత్‌నగర్‌లో..

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్‌లో చర్చి పాస్టర్ పి. డానియల్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో కార్పొరేటర్ సబిహా బేగం పాల్గొన్నారు. కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.



పార్కు దగ్గర రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

మ్యాన్‌హోళ్లలో వ్యర్థాల వెలికితీత

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కొంత కాలంగా హెచ్ఏఎల్ పార్కు ముందు అక్రమంగా నిర్వహిస్తున్న వ్యాపారాలతో మ్యాన్‌హోళ్లు నిండిపోతున్నాయని హెచ్ఏఎల్ కాలనీ వాసులు వాపోతున్నారు. ప్రతి సారి మ్యాన్‌హోళ్లు నిండినప్పుడల్లా కాలనీలో ఇబ్బందులు తప్పడం లేదని వారు తెలిపారు. వ్యాపారాలు నిర్వహించే వారు మ్యాన్‌హోళ్లలో చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు వేస్తుండటంతో 10 రోజులకు ఒకసారి మ్యాన్‌హోళ్లు నిండిపోయి కాలనీలోని రోడ్లు మురికి కూపంగా మారుతున్నాయని తెలిపారు. దీనికి తోడు వాటర్ పైపులైన్ కూడా జామై మంచినీరు సరాఫరా కావడం లేదని, తక్షణమే అధికారులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీ వాసులు కోరడంతో అధికారులు స్పందించారు. మ్యాన్‌హోళ్లలోని వ్యర్థ పదార్థాలను, మట్టిని తొలగించి మురుగు నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టారు. శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు కృషి చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

క్యూరింగ్ చేసి అందుబాటులోకి తేవాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్‌లోని హనుమాన్‌నగర్, వివేకానందనగర్ కాలనీల్లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. సీవరేజ్ లైన్‌ల పనులు సరిగ్గా లేవని, మురుగు నీరు ఇళ్లల్లోకి వస్తుందని స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆమె జీహెచ్ఎంసీ ఏఈ నిఖిల్, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ ప్రియాంకతో కలిసి పరిశీలించారు. సీసీ రోడ్డును నాణ్యతతో వేసి క్యూరింగ్ చేసి వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అదే విధంగా సీవరేజ్ లైన్లు మార్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో నరసింహ, ఎర్రన్న, వెంకటయ్య, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: సీసీ కెమెరాలతో నేరాల శాతం తగ్గుతుందని, ప్రతి ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, అవసరమైన దగ్గర మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని అబ్రహార్‌నగర్, బడే మజీద్‌లో మాజీ కౌన్సిలర్ మక్కాల నర్సింగ్‌రావు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం ప్రతి డివిజన్‌లోని ప్రతి ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. రాజకీయాలలో ఉన్నంత కాలం ప్రజలకు సేవ, వారి అభివృద్ధికి పాటు పడతానన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తేవాలని కోరారు. కార్యక్రమంలో నరేందర్‌గౌడ్, మేకల హరినాథ్, కర్రె జంగయ్య, ఖాదీర్, స్టార్ పాయింట్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలంలో పార్కు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎంసీహెచ్ఎస్ సభ్యులు

మోతీనగర్: మోతీనగర్ మీ సేవ సమీపంలో ఇళ్ల మధ్యన నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలంలో పార్కును ఏర్పాటు చేయాలని ఎంసీహెచ్ఎస్ పర్సనల్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ సి.హెచ్. హనుమంతరావు కోరారు. ఈ మేరకు సోమవారం జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వంశీకి ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా ఎంతో విలువైన ఖాళీ స్థలం నిరుపయోగంగా ఉందని తెలిపారు. ఆ స్థలం చుట్టూ మూడు రోడ్లు సైతం వేశారన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు, మద్యం ప్రియులకు అడ్డాగా మారిందన్నారు. భారీ వాహనాలను సైతం పార్కింగ్ చేస్తున్నారని తెలిపారు. ఖాళీగా ఉన్న స్థలానికి వెంటనే ఫెన్సింగ్, ప్రహరీ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సాగర్, కె. కొల్లప్ప, గోపాల్‌రావు, కుటుంబరావు, సుబ్బారావు, రాజు, ప్రసాద్, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



రాయదుర్గం: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు పరిష్కరించాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. హఫీజ్‌పేట్‌లోని జలమండలి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు కాలనీవాసులు నుంచి వచ్చే వినతిపత్రాలలోని సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేలా చూడాలన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. తాగునీటి పైప్‌లైన్ నిర్మాణం, యూజీడీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ప్రతిపాదనలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలు కాలనీవాసులు అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకొచ్చారు. నీటి సరఫరా సమయం, ప్రెషర్ తగ్గుతోందని, సురక్షితమైన తాగునీటిని సరఫరాను చేసేలా చూడాలని కోరారు.

ఆశాల బస్సు జాతా పోస్టర్ ఆవిష్కరణ

బాలానగర్: ఆశా వర్కర్ల బస్ జాతా పోస్టర్‌ను తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు అనిత, సబియా మాట్లాడుతూ.. కనీస వేతనం 18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. డిసెంబర్ 31న ఇందిరా పార్కు వద్ద జరిగే బస్ జాతా ముగింపు సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మంజుల, లలిత, సోమలత, మారుత, అఫ్రిన్, రుక్మిణి, లక్ష్మి, రేణుక, భాగ్యలక్ష్మి, రవళి, దీప్తి, నజీమా తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్: డబుల్ బెడ్ రూమ్ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డి.పోచంపల్లి డబుల్ బెడ్ రూమ్ సముదాయం నుంచి సికింద్రాబాద్ వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్, మంచినీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ, బస్సు సౌకర్యం వంటి వసతులు కల్పించాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామని తెలిపారు. త్వరలోనే అన్ని మౌలిక వసతులు పూర్తి చేస్తామన్నారు. అనంతరం బస్సులో నాయకులు, ప్రయాణికులతో కలిసి ఎమ్మెల్యే ప్రయాణించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, జక్కుల కృష్ణ యాదవ్, సాయి యాదవ్, ఆనంద్ కుమార్, బౌరంపేట బ్యాంక్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్లు అర్కల జీతయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, నేతలు కొల్తూరు మల్లేష్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం కొంపల్లి జడ్పీహెచ్ఎస్‌ను పరిశీలించారు. తాగునీటి సదుపాయం సరిగా లేదని, ఆడుకోవడానికి ప్లేగ్రౌండ్, కిచెన్ గదిని సమకూర్చాలని విద్యార్థులు కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్లలో తాను ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేశానని, సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, వైస్ చైర్మన్ గంగయ్యానాయక్, కౌన్సిలర్లు వినోద్, రవీందర్, సువర్ణ, దేవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోండి

పోలీసులకు జీహెచ్ఎంసీ డీసీ ఫిర్యాదు

కేపీహెచ్‌బీ కాలనీ: అక్రమ నిర్మాణాలు జరుపుతున్న భవనాల యజమానులకు/బిల్డర్లకు సీలింగ్ నోటీసులిచ్చి సీలింగ్ చేసినప్పటికీ , తిరిగి అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేపీహెచ్‌బీలోని నాలుగు వేర్వేరు ప్లాట్లలో జరుగుతున్న భవన నిర్మాణాల్లో ఉల్లంఘనలు జరిగాయని, అనుమతికి మించి అదనపు అంతస్తులు నిర్మిస్తుండటం, సెట్‌బ్యాక్‌లు వదలకపోవడం గుర్తించి టౌన్‌ప్లానింగ్ ఉద్యోగులు సీలింగ్ నోటీసులిచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నోటీసు గడువు ముగిశాక సదరు నిర్మాణాలను సీలింగ్ చేసినప్పటికీ, తిరిగి అక్రమంగా లోనికి ప్రవేశించి నిర్మాణ పనులు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కేపీహెచ్‌బీ వసంతనగర్‌లోని ప్లాట్‌నెంబర్లు 520, 710, 263, ఫేజ్ 2లోని ప్లాట్ నెంబర్1019ల యజమానులు అని ఫిర్యాదులో తెలిపినప్పటికీ, వారిలో మూడు ప్లాట్ల యజమానులెవరో మాత్రం పేర్కొనలేదు. టౌన్‌ప్లానింగ్ అధికారులు సీలింగ్ చేసినట్లు తెలిపే బ్యానర్లు, రిబ్బన్లు తొలగించి నిర్మాణ ప్రదేశంలోకి అక్రమంగా ప్రవేశించి, తిరిగి నిర్మాణాలు జరుపుతున్న వారిపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదులో కోరారు. పోలీసులు కేసు నమోదు చేశారు.





నృత్యం.. నయనానందకరం

మాదాపూర్: కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ చేనేత హస్తకళా మేళాలో భాగంగా సోమవారం కథక్, కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. డాక్టర్ సాయి జీవన శిష్యబృందం గణేశ్ వందన, సరస్వతీ వందన, అభినయ్‌గీత్, దుర్గస్తుతి, తరణ, తిల్లాన అంశాలను ప్రదర్శించారు. కళాకారులు వైష్ణవి, నెహ్వాల్, కిషన్, శ్వేతరావులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. త్రైలోక్య ఆర్ట్స్ అసోసియేషన్ గురువు ఇందిరా పరాశరం శిష్యబృందం వందనం, కొలువైతివా రంగసాయి, బృందావన, వేడెలారా, శ్రీమాత, శివాని, చార్వి, గీతికా, శ్రీయ, దర్శిని, కావ్య తనిష్కలు చక్కటి అభినయంతో సందర్శకులను అలరించారు.

14వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలు



సాక్షి,సిటీబ్యూరో: న్యాయమైన సమస్యల పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరాయి. రోజుకో విధంగా వినూత్న పద్ధతిలో నిరసన చేపడుతున్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ప్రధాన రోడ్డుపై వంటావార్పు నిర్వహించి సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని ఆయా వేషాధారణలతో ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించాలని పలు ప్రదర్శనలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా ప్రతినిధులు ఫణి, దేదివ్య, మల్లేష్‌తో సహ ఉద్యోగులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిపై యువతకు అవగాహన అవసరం

రాయదుర్గం: భారతీయ సంస్కృతి, చరిత్ర, విజయాలపై యువతకు అవగాహన అవసరమని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీఎఫ్ రహమాన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల తెలంగాణ వ్యాప్తంగా 50 మంది విద్యార్థుల బృందం హిమాచల్ ప్రదేశ్‌లోని ఎన్ఐటీ హమీర్‌పూర్‌కు పరివర్తన యాత్రలో పాల్గొన్నారు. సోమవారం వారిని ఉద్దేశించి ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ.. భారతదేశంలోని విభిన్న ప్రాంతాల మధ్య ఐక్యత, అవగాహనను పెంపొందించే లక్ష్యంతో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ (ఈబీఎస్‌బీ) గొడుగు కింద ఫ్లాగ్‌షిప్ ఇనిషియేటివ్ యువసంఘం కార్యక్రమంలో భాగంగా నిర్వహించారని గుర్తు చేశారు.

ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

సాక్షి,సిటీబ్యూరో: వివిధ జిల్లా శాఖలలో ఆన్‌లైన్ పెండింగ్ అప్లికేషన్ల సంఖ్య పెరిగిపోతోందని, వాటిని సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులపై కూడా తక్షణమే స్పందించాలన్నారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను ఆయన స్వీకరించారు. వినతులపై చేపట్టిన చర్యలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 94 అర్జీలను ఇన్‌చార్జి డీఆర్‌ఓ శంకర్ కుమార్‌తో కలిసి ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.